## ఘనంగా సమ్మర్ ఇస్లామిక్ తాలీమ్ క్యాంప్ ముగింపు




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు జన్మదిన శుభాకాంక్షలు..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 160 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 06 జూన్ 2026


# దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

- అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు
- సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు



**న్యూఢిల్లీ,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):**దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడలు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా

మిగతా2లో...

# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

- కమషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే
- కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది
- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులో పెండింగే
- పామూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం
- గతంలో ఇబ్బడిముబ్బడి అప్పలతో మళ్లీ అప్ప పుట్టకండా చేశారు
- జిల్లా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రెండోరోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో

మిగతా2లో...



# నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

- బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**మహబూబ్‌నగర్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు.

మిగతా2లో...

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

- పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
- కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటినా మంత్రి పొన్నం




**హైదరాబాద్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలి పారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు.

మిగతా2లో...

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

- కొత్త పార్టీ పెట్టబోతున్న అన్నామలై
- ప్రజలు లక్ష్యంగా రాజకీయ పార్టీని నడిపిస్తా...
- బిజెపికి భారం కాకూడదనే బయటకు వచ్చా...
- ఒంటరిగా పోటీచేయాలన్న తనవాదనను పట్టించుకోని బిజెపి
- గతంలో రజనీకాంత్ సార్ తనతో కలవమని కోరారు
- మీడియా సమావేశంలో మాజీ బిజెపి నేత అన్నామలై



**చెన్నై,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు రాజకీయాల్లో కొంతకాలంగా ఆసక్తి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం సీఎం విజయ్‌పై ఉన్న దృష్టి.. ఇప్పుడు అన్నామలై వైపు మళ్లింది. ఆయన ఇప్పటికే భాజపాను వీడగా.. తన రాజకీయ భవిష్యత్తు గురించి తాజాగా మీడియాతో మాట్లాడారు. బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా

మిగతా2లో...

## కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

- శోకం మిగిల్చిన ఎల్లమ్మ పండగ వేడుక
- మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత






## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

మిగతా2లో...



## తిరుమలలో ఎఐ ఆధారిత సేవలు భేష్

- టిటిడిని అభినందించిన మంత్రి పీయూష్ గోయల్

**తిరుమల,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** తిరుమలలో భక్తుల సౌకర్యార్థం కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

మిగతా2లో...

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- విశాఖలో సైకిల్ తొక్కిన చంద్రబాబు
- ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్ సవారీ
- ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన బాబు



# దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**విశాఖపట్నం,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివ ర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు.నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జీని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷–లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నా రు. నెట్ జీరో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా మని.. దీన్ని ఒక ఆదర్శంగా చేస్తామని సీఎం అన్నారు. నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా సైకిల్‌పై నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు.

# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు–రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు.

# ఆసక్తికరంగా తమిళనాడు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా'అని అన్నారు. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే అని అన్నామలై అన్నారు. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుందని అన్నామలై అన్నారు. ఈసందర్భంగా ప్రముఖ నటుడు రజనీకాంత్ ప్రస్తావన తెచ్చారు. తనతో చేతులు కలపమని గతంలో సూపర్‌స్టార్ అడిగారన్నారు. 2024లో తాను భాజపాలో చేరడానికి ఒకరోజు ముందు రజనీకాంత్ నాకు ఫోన్ చేశారు. ఆయన నేతృత్వం వహిస్తున్న రాజకీయ ఉద్యమంలోకి రావాలని ఆహ్వానించారు. కానీ, నేను అప్పటికే భాజపా సీనియర్ నేత బీఎల్ సంతోష్‌కు మాటిచ్చా. అందుకే రజనీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించా. నేను రాజకీయాల్లోకి రావడానికి కారణం బీఎల్ సంతోష్ ఇచ్చిన హామీనే. నా రాజకీయ ప్రవేశంపై ఉన్న ఊహాగానాలకు ముగింపు పలికేందుకు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాను. అయితే తమిళనాడు విషయంలో నా అభిప్రాయాలు.. భాజపా నాయకత్వం అభిప్రాయాలతో సరిపోలలేదు. ఈ విభేదాలను పరిష్కరించు కునేందుకు పార్టీ అగ్రనాయకత్వంతో 18 నెలలుగా ఎన్నో చర్చలు జరిపాను. ఇంక భాజపాకు భారంగా ఉండకూడదని అనుకున్నాను' అని అన్నామలై వివరించారు. ఇకపై స్వతంత్ర రాజకీయ మార్గంలో ముందుకువెళ్తానని, తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త బాటలు వేసేందుకు పోరాడతానని తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లోనే నా రాజీనామా గురించి చెప్పాను. అయితే పార్టీ పెద్దలు నన్ను ఆపారు. ఎన్నికల బాధ్యతలు నిర్వహించమని సూచించారు. ఇప్పుడు నా రాజకీయాలు సామాన్యుడి లక్ష్యంగా ఉంటాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా పోటీ చేస్తాను. అప్పటివరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అలాగే అన్నామలై మక్కల్ ఇయక్కమ్ పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. దానికి భారీ స్పందన వస్తోందని చెప్పారు. ఇదిలావుంటే అన్నామలై వెళ్లిపోవడం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని భాజపా తమిళనాడు చీఫ్ నైనార్ నాగేంద్రన్ వెల్లడించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ఎలాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపాటంమెంట్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

### - మల్కాజిగిరి చోరీ కేసులో పట్టివేత

**హైదరాబాద్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణెలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడిన నేపాలీ గ్యాంగ్.. లక్షల రూపాయల విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను అపహరించింది. ఈ చోరీ హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంటనే కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు.. సీసీటీవీ ఫుటేజ్‌లు, సెల్‌ఫోన్ లొకేషన్ డేటా ఆధారంగా గ్యాంగ్‌ను ట్రాక్ చేశారు. నేపాలీ ముఠా దేశంలోని వివిధ నగరాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# తిరుమలలో ఎఐ ఆధారిత సేవలు భేష్

(మొదటి పేజీ తరువాయి)

దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, తితిదే ఈవో ఎం.రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపా÷–టం÷–మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం 100 రోజుల్లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన తితిదే అధికారులను అభినందించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలలో తన తల్లి పేరిట మొక్క నాటారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)


కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

**కామారెడ్డి,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత, పావని , శివాని నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుక జరిగింది. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నలుగురు చిన్నారులు మంజీరా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి.. ఊబిలో చిక్కుకుని మరణించారని పోలీసులు చెప్పారు. వీరంతా 10 ఏళ్ల లోపు వారేనని తెలిపారు. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

# క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలో పొంగులేటి



**హైదరాబాద్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూముల వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.


# ఘనంగా సమ్మర్ ఇస్లామిక్ తాలీమ్ క్యాంప్ ముగింపు

**మస్జిద్-ఏ-కుతుబ్ షాహీ సభ్యులు సహకారంతో సమ్మర్ క్యాంప్ విజయవంతం**

**ఉప్పల్,జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతా పూర్‌లోని మస్జిద్–ఎ–కుతుబ్ షాహి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ ఇస్లామిక్ తాలీమ్ క్యాంప్2026 విజయవంతంగా ముగిసింది. మే 1 నుండి జూన్ 4 వరకు జరిగిన ఈ శిబిరంలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని ఇస్లామీయ విలువలు, ఖుర్ఆన్ పఠనం, నమాజ్ ప్రాముఖ్యత, ఇస్లామీయ నైతిక బోధనలు మరియు మంచి ప్రవర్తనకు సంబంధించిన అంశాలను అభ్యసించారు. శిబిరం ముగింపు సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పిల్లల్లో ఆధ్యాత్మిక, నైతిక విలువలను పెంపొందించడమే ఈ శిబిరం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పిల్లలు నేర్చుకున్న ఇస్లామిక్ విద్యను తమ దైనందిన జీవితంలో




ఆచరించాలని, సమాజానికి ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలని పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మస్జిద్ అధ్యక్షు డు ఎం.డి.తౌఫీక్, జనరల్ కార్యదర్శి జహంగీర్ పాషా, మసీదు కమిటీ సభ్యులు, మస్జిద్ ఇమామ్ హాఫిజ్ మొహమ్మద్ రషీద్ ఉర్ రహ్మాన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ శిబిరం ద్వారా పిల్లల్లో మతపరమైన అవగాహనతో పాటు క్రమ శిక్షణ, నైతిక విలువలు మరియు సామాజిక బాధ్య తలపై చైతన్యం



పెరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# సమాజ సేవకు ఆర్యవైశ్య సంఘం విశేష కృషి

**● తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాధి లక్ష్మీనారాయణ**



**హైదరాబాద్,జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజ శ్రేయస్సుకు ఆర్యవైశ్య సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాధి లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య సంఘం, ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన శుక్రవారం చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొని 30 మంది పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజంలో పేద, బడుగు వర్గాల సంక్షేమానికి పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆర్యవైశ్య సంఘం తనవంతు సమాజ సేవ చేస్తుందని అన్నారు. పిల్లలకు పుస్తకాల పంపిణి, చలికాలంలో పేదలకు బ్లాంకెట్ల పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం నిరంతరం సమాజ సేవ చేస్తూ సమాజ అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందని అన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజు, ఇలా ప్రత్యేక రోజుల్లో పార్టీల పేరుతో వేలకు వేలు వృదా ఖర్చు చేయకుండా ప్రతి ఒక్కరూ ఇలాంటి సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాతలు హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభఅధ్యక్షుడు కూన వెంకట గోపాల కృష్ణ, కల్వకుంట్ల సందీప్, పోలిటికల్ కమిటీ చైర్మన్ ఆగిరి వెంకటేష్, ఆర్య వైశ్య సంఘం ఇసామియాబజార్ ప్రధానకార్యదర్శి గాదే మహేష్, కోశాధికారి కొక్కొండ నిఖిలేశ్వర్, కొమ్మిరిశెట్టి అనిల్ కుమార్, విప్పల అనిల్ కుమార్, ఎర్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

**● టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ● ఇంచార్జ్ డిపిఆర్ఓకు జర్నలిస్టుల బృందం వినతి**

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడేషన్ కార్డులు అందివ్వాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్లోని డి పి ఆర్ ఓ కార్యాలయంలో ఇన్చార్జి డి పి ఆర్ ఓ ఆయుబ్ ఖాన్ ను టి యు డబ్ల్యూ జే ( టి జే ఎఫ్) జర్నలిస్టుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే ( టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు మాట్లాడుతూ... గత అనేక సంవత్సరాలుగా జర్నలిజం రంగాన్ని నమ్ముకుని వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్నారని, ప్రధానంగా చిన్న, మధ్య తరగతి పత్రికలకు సంబంధించిన జర్నలిస్టులకు ప్రధాన పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టులతో పాటుగా అందరికీ



ఒకేసారి అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. తప్పుడు ఫిర్యాదులు చేసే వారి పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న, మధ్య తరగతి, డెస్క్, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్, శాటిలైట్ వివిధ విభాగాలలో పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులు సకాలంలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కమిటీ మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు తక్షణమే అక్రిడేషన్ కార్డులు ఒకేసారి విడుదల చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యాలమందల జగదీష్, నగర ప్రధాన కార్యదర్శి



అమరపు కోటేశ్వరరావు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి ఉపాధ్యక్షులు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ సెక్రెటరీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి, సహాయ మూల జీవన్ రెడ్డి, మురళి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, సంతోష్, యాదగిరి, నాగశేఖర్ ,రవీందర్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్ , పాశం వెంకటేశ్వర్లు, కళ్యాణ్ , సాయి, లింగయ్య, గౌరీ శంకర్ ,రాంబాబు, శ్రీనివాస్, సీతారాములు, సంజీవరెడ్డి, నరసయ్య, రామ్ ఎస్ వి రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు జన్మదిన శుభాకాంక్షలు..




**కరీంనగర్ జిల్లా జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా ఈరోజు డీసీసీ కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ట్రాలీ వితరణ



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెవిలియన్ గ్రౌండ్ లోని నడక సాధకులు ఎంతో ప్రేమతో పెంచుతున్న మొక్కల మరింత రక్షణకు గాను రూ 7 వేలు విలువ కలిగిన 3 చక్రాల ట్రాలీని శుక్రవారం నగర ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆదిశంకరావు, డాక్టర్ పేర్ల శోభాదేవి లు కమిటీ వారికి అందజేసి పర్యావరణం పట్ల అవగాహన కలిగించి, మొక్కలు నాటి, అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ గావించారు. ఈ కార్యక్రమంలో రామనాథం, రాకం శ్యామ్ బాబు, విజయ్, డాక్టర్ రాంబాబు, వెంకట్, శంకర్, నరసింహారావు, మందా వెంకటేశ్వరావు, దామోదర్ రెడ్డి, పాషా, రమ శేఖరం, రమా, మాధవి లు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాల పురిటిగడ్డ తెలంగాణ

**- ఉద్యమకారులను అవమానిస్తే సహించేది లేదు!**

**- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బి.ఆర్.ఎస్ వ్యవస్థాపక సభ్యులు బొమ్మేర రామమూర్తి**

**- రాజకీయ స్వార్థం కోసం కోట్లాది మంది ఆత్మగౌరవాన్ని కించపరచవద్దు**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కోట్లాది మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, వందలాది మంది అమరుల నెత్తుటి త్యాగాల ఫలితంగా సాకారమైనది మన తెలంగాణ రాష్ట్రం. అలాంటి పవిత్రమైన తెలంగాణ సాధన ఉద్యమాన్ని, అందులో ప్రాణాలర్పించిన ఉద్యమకారులను అవమానించే విధంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను బి.ఆర్.ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ వ్యవస్థాపక సభ్యులు బొమ్మేర రామమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఉద్యమకారుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటం కోట్లాది మంది తెలంగాణ బిడ్డల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా వాయువుల కోసం సాగిన చారిత్రాత్మక పోరాటం అన్నారు. భావోద్వేగాలతో ఆడుకుంటే ప్రజాస్వామ్య




పద్ధతిలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

**ఖమ్మం తెలంగాణ భవన్‌లో గర్జించిన ఉద్యమకారులు..** "తెలంగాణ ఉద్యమం అనేది కేవలం ఒక రాజకీయ ప్రక్రియ కాదు, అది ఈ గడ్డపై పుట్టిన ప్రతి బిడ్డ ఆత్మగౌరవ పోరాటం అన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయక ఉరికొలిపిన విద్యార్థులు, వీధిన పడ్డ కుటుంబాలు, రాత్రింబగళ్లు శ్రమించిన ఉద్యోగులు, కార్మికులు, రైతులు.. ఇలా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల హృదయ స్పందన ఈ ఉద్యమం అన్నారు. అంతటి పవిత్ర పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడటం ఎవరికీ తగదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నేల త్యాగాలను గౌరవించాల్సిందేనాన్నారు." రాజకీయ ప్రయోజనాల కోసం, తాత్కాలిక స్వార్థాల కోసం తెలంగాణ ప్రజల సెంటిమెంట్లతో, భావోద్వేగాలతో ఆడుకోవడం అత్యంత బాధాకరమని రామమూర్తి అన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను గౌరవించడం కనీస బాధ్యత అని హితవు పలికారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, తెలంగాణ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమ సెగను, ఆవేదనను పంచుకుంటూ ఖమ్మం జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, నందిగామ రాజ్ కుమార్ జానీ, మందడపు శంకర్ రావు, లింగనబోయిన సతీష్, అశోక్ సింగ్, అజ్మీరా రమేష్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 50 మొక్కలు నాటిన వాసవీ క్లబ్ సభ్యులు



**గంగాధర, జూన్ 5 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లాలోని ఆక్సిజన్ పార్కులో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు 50 మొక్కలను నాటారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జై జై వాసవీ వాసవీ క్లబ్ కాపుల్స్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు, స్నేహితులు, ఆర్య వైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ..



**కరీంనగర్ జిల్లా జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 29న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను 1969 తెలంగాణ ఉద్యమకారుడు కత్తురోజు రాజమణి చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా బృందం ఆవిష్కరించింది. అనంతరం కరీంనగర్‌లోని తన స్వగృహంలో ఉద్యమకారులతో సమావేశమైన రాజమణి, 1969 తెలంగాణ ఉద్యమంలో జరిగిన కీలక సంఘటనలను, ప్రస్తుతం ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తెలంగాణ సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 29న 101 కార్లతో విజయ సంకల్ప యాత్ర నిర్వహించి, తెలంగాణ ఉద్యమకారుల పట్ల సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తామని తెలిపారు. జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులందరూ ఈ యాత్రలో తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, రాష్ట్ర నాయకులు గరిగె కోటేశ్వర్, బండారి కుమార్, నూనె రాజు, అంబటి రవీందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో బాలల భిక్షాటన నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు





**వేములవాడ, జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజన్న ఆలయ పరిధిలో చిన్నారులు భిక్షాటన చేయకుండా, వారిని విద్యా మార్గంలో నడిపించేందుకు జిల్లా బాలల పరిరక్షణ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేములవాడ పట్టణంలోని పెద్దమ్మ కాలనీకి చెందిన పలువురు చిన్నారులు పాఠశాలకు వెళ్లకుండా ఆలయ ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి కవిత మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు పిల్లల కోసం పెద్దమ్మ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అలాగే పెద్ద పిల్లలకు లక్ష్మాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పిల్లల విద్యాభివృద్ధికి యువచైతన్య దీపం ఫౌండేషన్ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఆధునిక సమాజంలో భిక్షాటన వ్యవస్థకు చోటు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిలాపురం శంకర్, యువచైతన్య దీపం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి, పెద్దమ్మ కాలనీ గ్రామస్తులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు హాజరైన ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు



**కరీంనగర్ టౌన్ జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుసేన్ ఆదేశాల మేరకు ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం బియబాని, మజీద్ హుస్సేన్, జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమ అమలు నిర్వహణ కోసం ప్రజల్లో విశేషంగా విస్తృతంగా ప్రచారం చేపట్టడం సంతోషకరమన్నారు. ఎస్ఐఆర్ నిర్మాణ కోసం బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించడంతో పాటు.. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొనడం కోసం ఎంఐఎం పార్టీ ద్వారా ట్రైనింగ్ వర్క్ షాప్ లను ఏర్పాటు చేయడం, బిఎల్ఏ-2లకు మాస్టర్ ట్రైనర్లతో ట్రైనింగ్ ఇవ్వడం ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత....

## మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు.....

**కరీంనగర్ టౌన్ జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , పర్యావరణాన్ని రక్షించకపోతే భవిష్యత్ తరాలకు భద్రత లేదని, అందుకే భవిష్యత్ తరాలకు పచ్చని భూమిని అందించడానికి ప్రతి ఒక్కరి కృషి చేస్తేనే రేపటికి భద్రత ఉంటుందని మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణరావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జ్యోతి నగర్ లో గల గణేష్ మండపం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన పంచభూతాల కలయికే మన పర్యావరణం అని, అయితే, ఆధునిక మానవుడి స్వార్థం, మితిమీరిన సాంకేతికత, పారిశ్రామికీకరణ వల్ల నేడు పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందన్నారు. గ్లోబల్ వార్మింగ్ (భూతాపం), అడవుల నరికివేత, ప్లాస్టిక్ కాలుష్యం వంటి సమస్యలు భూమి ఉనికికే ప్రమాదకరంగా మారాయన్నారు.. పర్యావరణాన్ని రక్షించుకోవడానికి భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన పరిస్థితులు అవసరం ప్రస్తుతం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా పర్యావరణాన్ని రక్షించుకోవడానికి మొక్కలను నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం, జల సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం , వ్యర్థాల నిర్వాణపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు తెలిపారు. పర్యావరణాన్ని





పరిరక్షించకపోవడంతో నేడు నిప్పుల కొలిమిలా వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం ఉన్న విపరీతమైన ఎండలు, వడగాల్పులే ఇందుకు నిదర్శనం అన్నారు. బొగ్గు ,పెట్రోల్ డీజిల్ తో నడిచే వాహనాల తో తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడుతుందని, అందుకే ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ప్రకృతిని వినియోగించుకోవాలని, సోలార్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. చెట్లను విరివిగా పెంచినప్పుడే ప్రాణవాయువు లభిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. మానేరు పర్యావరణ సమితి .బండి శ్రవణ్ కుమార్. సురేందర్ రెడ్డి. తోట లక్ష్మణ్ రావు.



వేముల రవీందర్. వి. సుగుణా కర్ రెడ్డి. ప్రవీణ్ రెడ్డి. రుద్ర లక్ష్మణ్. గుజ్జా శ్రీను. వెంకట స్వామి. సత్యనారా యణ. తోట రాజేందర్. పిట్టల మధుసూదన్. దయ్యాల మల్లేశంలతోపాటు డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

## జిల్లా విద్యాశాఖ అధికారులకు టీజేఎఫ్ జర్నలిస్టుల బృందం వినతి

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రవేట్ విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు డి ఈ ఓ, డిఐఈ ఓ జిల్లా విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్, వెబ్, కేబుల్, డెస్క్, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ ల తో పాటు వివిధ విభాగాలలో వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కార్యాలయం సూపర్డెంట్ నాగజ్యోతి లకు వారి కార్యాలయాలలో శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జె (టిజెఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిస్టులు ఇటు ప్రభుత్వానికి అటు ప్రజలకు మధ్య



వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తూ ఉంటారని, వారి పిల్లలకు ప్రవేట్, ఎయిడేడ్, పాఠశాలలు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. గత అనేక సంవత్సరాలుగా జర్నలిస్టు పిల్లలకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ సర్క్యులర్ జారి చేసే వారిని దీని ఫలితంగా అనేక మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందని, 2026- 27 విద్యా సంవత్సరానికి కూడా ఇటు డిఇఓ, అటు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి సర్కులర్లను విడుదల చేసి జర్నలిస్టు పిల్లలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వనం నాగయ్య, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు యాలమందల జగదీష్, నగర



ప్రధాన కార్యదర్శి అమరపు కోటేశ్వరరావు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి ఉపాధ్యక్షులు, ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ సెక్రెటరీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి, సహాయ మూల జీవన్ రెడ్డి, మురళి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, సంతోష్, యాదగిరి, నాగశేఖర్ ,రవీందర్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంతం శ్రీనివాస్ , పాశం వెంకటేశ్వర్లు, కళ్యాణ్ , సాయి, లింగయ్య, గౌరీ శంకర్ ,రాంబాబు, శ్రీనివాస్, సీతారాములు, సంజీవరెడ్డి, నరసయ్య, రామ్ ఎస్ వి రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునికీకరణ జాప్యంపై ఎంపీ రఘురాంరెడ్డి ఆగ్రహం





## - యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

## - స్టేషన్ ఆవరణలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రామసహాయం

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల తీరుపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఎంపీ.. సుమారు గంటన్నర పాటు స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. **క్షేత్రస్థాయిలో తనిఖీ..** ఎస్కలేటర్‌ను ఆన్ చేయించి రెండో ప్లాట్‌ఫామ్‌కు చేరుకొని దాని




పనితీరును గమనించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి, నిర్మాణాలకు సంబంధించిన మ్యాప్‌లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆధునికీకరణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు రానీయొద్దు.. వర్షాకాలం సమీపిస్తుండటంతో అసంపూర్తిగా ఉన్న పనుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసి ప్రయాణికులకు అందు బాటులోకి తీసుకురా వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, సత్యనారాయణ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ."అమ్మ పేరుతో ఒక మొక్క"ను నాటే

# గొప్ప మహత్తర శ్రీకారం చుట్టారు



**• ప్రధాని మోదీ దూరదృష్టి వల్లే దేశం ఆర్థికంగా స్థిరంగా ముందడుగు .... • ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో దేశ ప్రజల రక్షణే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం. • కాంగ్రెస్ నేతలు ఇంకా ప్రాంతీయ విద్వేషాలు , రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికాదు. అలాంటి చర్యలతో తెలంగాణ భవిష్యత్తుకు తీవ్ర నష్టం.. • బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర.....**

**కరీంనగర్ జిల్లా జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** పర్యావరణాన్ని రక్షించడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని , పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ "మాకే నామ్ పర్ ఏక్ పేడ్ "(అమ్మ పేరుతో ఒక చెట్టు,) అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం , అమ్మ గౌరవార్థం , జ్ఞాపకార్థం ఒక చెట్టును పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఆలోచనను ప్రజల్లో మోది రేకెత్తించారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా , ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని , ప్రధాని మోదీ పిలుపుమేరకు మాకే నామ్ పర్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక మొక్క ) నాటే కార్యక్రమం శుక్రవారం రోజున అలుగునూర్ పరిధిలోగల 133,134 పోలింగ్ బూత్ లో చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో బిజెపి శ్రేణులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యావరణ పరిరక్షణ కోసం అనేక చర్యలు చేపట్టిందని , ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా దేశవ్యాప్తంగా అమ్మ పేరుతో ఒక మొక్కను నాటే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధాని పిలుపు మేరకు దేశవ్యాప్తంగా అమ్మ పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా ప్రపంచంలోని అనేక దేశాలు విపరీతమైన సమస్యలతో కోట్టుమిట్టాడుతున్నాయనితెలిపారు. ప్రధానంగా ప్రపంచంలోని పలు దేశాలు యుద్ధాలు, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణంతో కొట్టుమిట్టాడుతుంటే, మోదీ ప్రభుత్వ దూరదృష్టి వల్లే భారతదేశం ఆర్థికంగా స్థిరంగా ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. ప్రధానంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభం తలెత్తే అవకాశాలు ఉన్నా, దేశంలో ఉన్న 80 కోట్లకు పైగా ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తూ 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' ద్వారా మోదీ ప్రభుత్వం అండగా నిలిచిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు సరిహద్దుల్లో



ఉద్రిక్తతలు ఉన్నా, అంతర్జాతీయ వేదికలపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాత్మక విదేశాంగ విధానం వల్ల దేశ సార్వభౌమాధికారానికి ఎటువంటి ఢోకా లేకుండా పోయిందని కొనియాడారు. అంతర్జాతీయ కంపెనీలు భారత్ వైపు చూసేలా 'మేక్ ఇన్ ఇండియా' పరిధిని పెంచుతూ, భవిష్యత్తులో రాబోయే ఆర్థిక సవాళ్లను తట్టుకునేలా దేశీయ పరిశ్రమలను కేంద్రం బలోపేతం చేస్తోందని ఆయన వివరించారు.ప్రపంచంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు వీలుగా దేశాన్ని మోదీ ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధం చేసిందని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని బొంతల కళ్యాణ్ చంద్ర స్పష్టం చేశారు. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సామాన్యుల ఆర్థిక భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. ముఖ్యంగా బంగారంపై మితిమీరిన పెట్టుబడులు పెట్టడం కంటే దేశీయ పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా అటు కుటుంబానికి, ఇటు దేశానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.ఆర్థిక భద్రతకు పొదుపే మార్గం అని, కేవలం బంగారం రూపంలోనే కాకుండా బ్యాంకులు, ప్రభుత్వ పొదుపు పథకాల ద్వారా డబ్బును దాచుకోవడం వల్ల ఆపత్కాలంలో త్వరగా ఉపయోగపడుతుందని తెలిపారు. భారతీయులు ఎక్కువగా బంగారం కొనుగోలు చేయడం వల్ల విదేశాల నుండి దిగుమతులు పెరిగి దేశ కరెన్సీపై భారం పడుతుందని, అదే సొమ్మును పొదుపు రూపంలో పెడితే దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందని వివరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ప్రజల రక్షణ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తుంటే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తెలంగాణ విభజన రాజకీయాలు చేస్తుందని ఆయన ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచిన ఇంకా ప్రాంతీయ విద్వేషాలు , రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ రాజకీయాలు చేస్తుందని , ఇది తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. జనసేన అధినేత , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం , మంత్రులు , కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలు , నిర్బంధాలతో తెలంగాణలో స్వేచ్ఛాయుత వాతావరణం లేదనే భావన ఏర్పడుతుందని ఏర్పడుతుందని , దీనివల్ల తెలంగాణ భవిష్యత్తుకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగమేననే విషయాన్ని మరిచి కాంగ్రెస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# హర్షించాల్సింది పోయి విమర్శలా..?

**• నాడు కరీంనగర్ ఎంపీగా కెసిఆర్ , వినోద్ కుమార్ రావు చేయలేని పని బండి సంజయ్ చేస్తున్నందుకా మీ ఏడుపు...? • కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే ... • బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్.... • ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు గంగాధర చౌరస్తాలో పాలాభిషేకం**

**కరీంనగర్ జిల్లా జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారిని (ఎన్ హెచ్-563) 4 వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రహదారి నిర్మాణం కోసం చేసిన కృషిని బిఆర్ఎస్ నేతలు , మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నారని, అందుకే ఆయన అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని , సుంకే రవిశంకర్ చేసిన వ్యాఖ్యలను బిజెపి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి




శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు గంగాధర చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగిత్యాల, కరీంనగర్ జాతీయ రహదారి విషయంలో నాడు కరీంనగర్ ఎంపీగా కెసిఆర్, వినోద్ రావు చేయలేని పని బండి సంజయ్, బిజెపిపై ఎమ్మెల్యే సుంక రవిశంకర్ నోరు పారేసుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు , కరీంనగర్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన కెసిఆర్ చేయలేని పనిని బండి సంజయ్ చేస్తే హర్షించాల్సింది పోయి విమర్శలు చేస్తారా..,? రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉంది.. ఆ సమయంలో కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ రావు ఉన్నా కూడా ఏనాడు కూడా ఈ ప్రాంత రహదారి కోసం ఆలోచన చేయలేదని ఆయన విమర్శించారు. నేడు కరీంనగర్ జగిత్యాల రహదారి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో బండి సంజయ్ కుమార్ పని చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రహదారి నిర్మాణం చేపించడానికి నిధులు మంజూరు చేయిస్తే జీర్ణించుకోలేని స్థితిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలన్నారు. కరీంనగర్.. జగిత్యాల ప్రాంత ప్రజల దశాబ్దాల గల సమస్యను కేంద్రం పరిష్కరించిందని , కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణం కోసం బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బండి సంజయ్ కృషితోనే నేడు కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారి సాకారం అవుతుందన్నారు. ప్రధానంగాతెలంగాణలోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు (ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల మరియు జగిత్యాల-కరీంనగర్) కలిపి మొత్తం రూ.₹7,597.16 కోట్లను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇందులో కేవలం జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ కోసమే రూ.₹2,395 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. దాదాపు 58 కిలోమీటర్ల పొడవుతో జగిత్యాల - కరీంనగర్ సెక్షన్‌ను( బిఓటి) పద్ధతిలో విస్తరించనున్నారని తెలిపారు. ఇందులో భారీ ట్రాఫిక్ ఉండే జనాభా ప్రాంతాలను తప్పిస్తూ కొత్తగా 34.96 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారని, ఈ హైవేపై వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారనీ తెలిపారు.. ముఖ్యంగా ఈ 4 లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే జగిత్యాల - కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాల పాటు కలిసి వస్తుందని, ఈ హైవే విస్తరణ వల్ల జగిత్యాల, పోతారం, గంగాధర, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పూర్తిగాతొలిగి పోనున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పీఎం గతి శక్తి కింద రూపుదిద్దుకోవడం వల్ల కరీంనగర్, జగిత్యాల జిల్లాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి, ముఖ్యంగా స్థానిక వ్యాపారాలకు, రైతులకు తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి ఎంతో మేలు చేకూరనుందన్నారు.ఈ కార్యక్రమంలో గంగాధర మండల బిజెపి శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్, జిల్లా కోశాధికారి వైద్య రామానుజన్, అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు తుమ్ నారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ సాదాల భాస్కర్, ప్రజా ప్రతినిధులు చంద్రారెడ్డి, గాలిపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు రేండ్ల శ్రీనివాస్, తాళ్ల రాజశేఖర్, జిల్లా నాయకులు సుద్దాల రవీందర్ రెడ్డి, వినుకొండ నరసింహారెడ్డి, పెంచాల రాములు,ఆకుల మనోహర్, దయ్యాల ప్రణయ్, హర్ష రాజు, వోడ్నాల రాజు, పరశురాముడు, చిందం ఆంజనేయులు, సుంకరి అనిల్, కట్ల శ్రీనివాస్, కొమురయ్య, శ్రీనివాస్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19వ వార్డులో డ్రైనేజీ సమస్యకు చెక్

**- ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే కౌన్సిలర్ రాధా వీరాస్వామి**



**కల్లూరు, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టణంలోని 19వ వార్డులో మోటమర్రి ప్రభాకర్ ఇంటి సమీపంలో డ్రైనేజీ నీరు సరిగా ప్రవహించక నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వ్యాపించి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన వార్డు కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరాస్వామి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి జేసీబీ సహాయంతో డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించే చర్యలు చేపట్టించారు.కౌన్సిలర్ చొరవతో చేపట్టిన ఈ పనుల వల్ల డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించే పరిస్థితి ఏర్పడగా, స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న కౌన్సిలర్ రాధా వీరాస్వామి సేవలను వార్డు ప్రజలు అభినందించారు. సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించడం ఆమె ప్రజాప్రతినిధిగా ఉన్న బాధ్యతాయుత వైఖరికి నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి కిరణ్ కుమార్ పాల్గొని పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వార్డులోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరాస్వామి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా మహా రక్తదాన శిబిరం..






**రామడుగు జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకుని రామడుగు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పరుశురాం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహా రక్తదాన శిబిరం నిర్వహించారు."మీ ఒక్క యూనిట్ రక్తం... ఒక ప్రాణాన్ని కాపాడుతుంది" అనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, యువత మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో దాదాపు 30 మంది రక్తదానం చేసి 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ హాజరయ్యారు. అలాగే యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యాప్రసన్న రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ పురెళ్ల గోపాల్, దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, రామడుగు గ్రామ యువత, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# మొబైల్ టెక్నీషియన్ కోర్సులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలి: మైనారిటీ సంక్షేమ అధికారికి ఎఐఎంఐఎం వినతి





**కరీంనగర్, జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లో ఎన్‌ఏసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3 నెలల మొబైల్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐఎంఐఎం కరీంనగర్ బృందం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారికి వినతిపత్రం సమర్పించింది.90 రోజుల కోర్సులో ఇప్పటికే 35 రోజులు పూర్తయినప్పటికీ శిక్షణకు అవసరమైన పరికరాలు అందించలేదని, విద్యార్థులకు అనుకూలంగా లేని ఇనుప షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారని, త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో పాటు కోర్సు సిలబస్‌లో అధిక భాగం ఇంకా పూర్తి కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో, గాలి, వెలుతురు బాగా వచ్చే తరగతి గదులు, అవసరమైన శిక్షణ పరికరాలు, త్రాగునీటి సౌకర్యం మరియు మెరుగైన శిక్షణ వాతావరణాన్ని తక్షణమే కల్పించాలని ఎఐఎంఐఎం నాయకులు డిమాండ్ చేశారు. శిక్షణార్థుల హక్కులు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సమీ, టౌన్ జనరల్ సెక్రటరీ బర్కత్ అలీ, ఎఐఎంఐఎం కార్పొరేటర్లు మోసిన్ మొహియుద్దీన్, అతీఫ్ అతీనా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కమిషనర్‌గా రామచంద్రరావు




**కల్లూరు, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. రామచంద్రరావు కు మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలందించడంలో తమ పూర్తి సహకారం అందిస్తామని సిబ్బంది పేర్కొన్నారు.కొత్తగా బాధ్యతలను స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధి మరియు పరిపాలనా సేవల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరావు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

# దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**సత్తుపల్లి, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇటీవల జిల్లాలో రాత్రి వేళల్లో ఇంటి దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపారు. ముఖ్యంగా ఎండల వలన చాలా మంది గ్రామాలలో రాత్రివేళ ఇంటి బయట వరండా లో నిద్ర పోయేటప్పుడు కూడా ఇంటి డోర్ కి తాళం వేసి ఉంచుకోండిరాత్రి పడుకునే ముందు ఇంటి ప్రధాన ద్వారం, వెనుక ద్వారం, అల్మారా లకు సరైన తాళాలు వేసుకున్నారో లేదో చెక్ చేసుకోవాలి. బంగారం, నగదు, విలువైన పత్రాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం మంచిది. ఇంట్లో ఉంచితే సురక్షితమైన ప్రదేశంలో ఉంచాలి. రాత్రిపూట ఇంటి బయట, మెట్ల వద్ద, పెరట్లో లైట్లు వేసి ఉంచాలి. చీకటి ప్రదేశాలే దొంగలకు అవకాశం. ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నట్లయితే ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా బీట్ కానిస్టేబుల్‌కు సమాచారం ఇవ్వాలి అని ఇరుగుపొరుగు వారికి కూడా చెప్పాలి అన్నారు. కాలనీలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగేవారు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి మరియు అట్టి సీసీ కెమెరాల యాక్సెస్ ను మాకు ఇస్తే పోలీస్ స్టేషన్ నుంచి కూడా చూడటం జరుగుతుంది అని అన్నారు. ఇది నేర నియంత్రణకు, నేరస్థులను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేశాము. బీట్ పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బందితో ప్రతి గ్రామంలో కాలనీలో నిఘా ఉంచాము. పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచబడింది అని తెలిపారు. ప్రజల సహకారం పోలీస్‌కు ఎంతో అవసరం.పోలీస్ డిపార్ట్మెంట్ తో పాటుగా మీరు కూడా అప్రమత్తంగా ఉండటం వలన దొంగతనాలు అరికట్టవచ్చునని అత్యవసర సమయంలో డయల్ 100 ద్వారా పోలీస్ ను వెంటనే సంప్రదించండి అని తెలిపారు.

# ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే కవ్వంపల్లి








**తిమ్మాపూర్, జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి ప్రజాభవన్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ & టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ & రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జర్నలిస్టు జూలూరు పుండరీ చారికి ఘన సన్మానం



**హైదరాబాద్ జూన్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి కి విశ్వకర్మ లెజెండరీ అవార్డు 2026వచ్చిన సందర్భంగా బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్న గౌడ్ ,ఫ్రంట్ రాష్ట్ర నాయకులు అంబాల నారాయణ గౌడ్, దుర్గయ్య గౌడ్, బైరు శేఖరు శాలువతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ప్రజా సమస్యల పై నిరంతరం ప్రశ్నించి తన కలం తో ఎన్నో వార్తలు రాసి ప్రజలను చైతన్యవంతం చేశారని వారన్నారు, పత్రికా రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న పుండరీచారికి వారు అభినందనలు తెలిపారు. మరెన్నో అవార్డులు అందుకొని మరింత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు.

# మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు..








**కరీంనగర్ జిల్లా జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల కేక్ కటింగ్ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.కోర్ట్ చౌరస్తా వద్ద జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరా చౌక్‌లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌టీఏ మెంబర్ పడాల రాహుల్, వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని కార్యకర్తలతో కలిసి వేడుకలు నిర్వహించారు.ఎస్ఆర్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం డీసీసీ కార్యాలయానికి విచ్చేసిన డా. మేడిపల్లి సత్యంను పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు, పెన్నులు, నోటుబుక్కులు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డా. మేడిపల్లి సత్యం ప్రజాసేవకు అంకితమైన నాయకుడని కొనియాడారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆర్‌టీఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ మేడిపల్లి సత్యం నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నాయకుడిగా కీలక పాత్ర పోషించిన డా. మేడిపల్లి సత్యం, విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, డీసీసీ అధ్యక్షుడిగా ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కల్లూరు అభివృద్ధికి మంత్రి పొంగులేటిని కలిసిన మున్సిపల్ చైర్మన్

- పలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేత

**సహకారం అందిస్తామని మంత్రి హామీ**



**కల్లూరు, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పట్టణ అభివృద్ధికి అవసరమైన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కల్లూరు పట్టణ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి పేర్కొన్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో శీలం కృష్ణారెడ్డి, పొంగులేటి యూత్ అసోసియేషన్ నాయకుడు శ్రీకాంత్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు ధరావత్ రవికుమార్, హైకోర్టు న్యాయవాది బానోత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద వంగర పోలీస్ స్టేషన్‌కు గంజాయి టెస్టింగ్ కిట్లు




**పెద్దవంగర జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చడానికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్. పి. ఐ పి ఎస్ ఆదేశాల మేరకు గంజాయి సంబంధిత యూరిన్ టెస్టింగ్ కిట్లు పెద్ద వంగర పోలీస్ స్టేషన్ కు తీసుకు రావడం జరిగింది. మండలంలోని ప్రతి గ్రామంలో ఎవరైనా గంజాయి తాగి వారి జీవితాలను నాశనం చేసుకుంటునట్లు ఏదైనా సమాచారం ఉంటే, పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇస్తే, వెంటనే వారికి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ చేసి, రిపోర్టు తీసుకొని గంజాయి సేవించిన వారిపై మరియు వారికి గంజాయి అందించిన వారిపై చర్య తీసుకోబడును. గంజాయి రహిత మండలం గా మార్చడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి, సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించగలరు. సమాచారం తెలిసిన వెంటనే డయల్ చేయాల్సిన ఫోన్ నెంబర్లు 8712656978ఎస్ ఐ పెద్దవంగర 8712656979 పి ఎస్ నంబర్ ఎస్ఐ Ch. ప్రమోద్ కుమార్ విలేకరుల సమావేశం లో తెలియచేయడం జరిగింది.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో మొక్కల నాటకం..




**ఎల్లారెడ్డిపేట, జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామంలోని అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో మొక్కల నాటకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ షేక్ సబెర బేగం గౌస్ పాల్గొని మొక్కలు నాటారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో చెట్ల ప్రాముఖ్యతను తెలియజేసే "పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా?" అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఏఓ అఫ్జల్ బేగం, డీఎస్పీ నాగేంద్ర చారి, డీఎఫ్‌వో, ఎమ్మార్వో సుజాత, ఎంపీడీవో సత్తయ్య, హరిదాస్‌నగర్ సర్పంచ్ చిరం నాగరాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దేవపూర్ సున్నపురాయి గనులలో మొక్కలు నాటిన అధికారులు

- పర్యావరణాన్ని కాపాడండి ఆరోగ్య వంతులుగా జీవించండి.
- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సున్నపురాయి గనిలో మొక్కలు నాటారు.




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 5(పిసిడబ్ల్యూ న్యూస్):** దేవాపూర్ అంటేనే ఎంతో ప్రశాంతత కలిగి ఉంటుంది అందులో సున్నపురాయి గనిలో ఎక్కడ లేని ప్రశాంతత చక్కని వాతావరణం చల్లటి ప్రదేశం ఎటు చూసినా కొండలు చెట్లు అడవి మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే సున్నపు రాయికొండలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అదాని సిమెంట్ అధికారులు మొక్కలు నాటారు. కర్మాగారానికి చెందిన ప్రతినిధులు ప్రసంగిస్తూ వాతావరణంలో జరుగుతున్న మార్పు అరికట్టాలంటే పర్యావరణం అనుకూల విధానాలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటి ప్రశాంత పొందుతూ చక్కటి గాలిని పీల్చుకుంటూ పర్యావరణాన్ని కాపాడి ఆనందంగా జీవించాలని కోరారు. కొందరు రైతులు పర్యావరణాన్ని కాపాడాల్సింది పోయి వారి పంట పొలాల్లో వ్యర్థాలను పగలబెడుతూ పర్యావరణాన్ని దెబ్బతీయటం సరికాదని భూమిలో ఉన్న సారాన్ని కోల్పోయి మేలు చేసే




కీటకాలు చనిపోవడమే కాకుండా ఎన్నో రకాల అనర్థాలకు దారితీస్తున్నది అలా కాకుండా పర్యావరణాన్ని కాపాడే విధంగా అధికారులు చెప్పిన విధంగా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్లాస్టిక్ వర్గాలను విచ్చలవిడిగా వాడుతూ ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల భూమిలో కూడా అవి కలుషితమైపోయి పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా ఉంటుందని మనం ఎప్పుడు బట్టతో తయారుచేసిన, లేదా పేపర్ తో తయారు చేసిన సంచులను వాడి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉన్నదని వారు పేర్కొన్నారు చాలామంది నీటిని వృధా చేస్తున్నారని ఎక్కడైనా కుళాయిలు నుండి నీరు వెళ్లినట్లు గమనిస్తే వెంటనే వాటిని అరికట్టేందుకు చూడాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని నేటి తరానికి నీరు అందుతుంది రానున్న తరాలకు నీటి కష్టాలు ఎన్నో ఉంటాయని అవన్నీ దృష్టిలో పెట్టుకొని నీటిని వృధా చేయకుండా ఇప్పటినుండి మనం అరికడితే రానున్న తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమం లో, కమలేష్ తంబూర్నే, దేవేష్ రాజ్ పంజిరాయ్, పవన్ కుమార్, శేఖర్ రెడ్డి, ఫ్యాక్టరీ మరియు గణి కార్మికులు పాల్గొన్నారు.

# బీసీలను అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



**హైదరాబాద్, జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో బీసీలను జనాభా పరంగా మాత్రమే కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధిలో బీసీలు కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదని, వారు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి వారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి వ్యాపారం వరకు, చేతి వృత్తుల నుంచి సేవా రంగంలో బీసీల పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీసీలకు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి యూనిట్లు, ప్రత్యేక రుణ పథకాలు ప్రకటించినా అర్హులైన లబ్ధిదారుల సంఖ్యతో పోలిస్తే సహాయం పొందిన వారి సంఖ్య చాలా తక్కువగా వందల సంఖ్యలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్లు కేవలం ప్రభుత్వాల రాజకీయ ప్రచార సాధనాలుగా మారిపోయాయనే అభిప్రాయం సర్వత్రాఉందని అన్నారు. ఎన్నికల ముందు భారీ ప్రకటనలు చేయడం, తరువాత అమలులో నిర్లక్ష్యం చూపడం గత కొన్నేళ్లుగా కనిపిస్తోందని అన్నారు. కార్పొరేషన్లకు పూర్తి స్థాయి చైర్మన్లు. బోర్డులు లేకపోవడం, సిబ్బంది కొరత, పరిపాలన జాప్యాలు కూడా పనితీరును ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. బీసీ కార్పొరేషన్లు బలహీనంగా ఉంటే సామాజిక న్యాయం అసంపూర్తిగానే మిగులుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కార్పొరేషన్లను నిజమైన సాధికారత వేదికలుగా మార్చగలిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ లక్ష్యం సార్థకమవుతుందని అన్నారు. లేకపోతే బీసీ కార్పొరేషన్లు ప్రజల ఆశల చరిత్రలో మరో అసంపూర్తి అధ్యాయంగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి బీసీ కార్పొరేషన్ల బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# హ్యాపీ డేస్ ప్లే స్కూల్‌ను ప్రారంభించిన దత్తాత్రేయ



**బోడుప్పల్ జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ప్లే స్కూల్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని మాజీ కేంద్రమంత్రి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. శుక్రవారం బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని ఆంజనేయ నగర్ కాలనీలో హ్యాపీ డేస్ డే కేర్, ప్రీ స్కూల్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో బలమైన పునాదులు నిర్మించేందుకు ప్లే స్కూల్ ఎంతగానో ఉపయోగ పడతాయని ఇందుకోసం ప్రభుత్వం సైతం తనవంతు ప్రయత్నాలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన హ్యాపీడేస్ ప్లే స్కూల్ యాజమాన్యం చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం పట్ల దత్తాత్రేయ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ పేదలకు సైతం పేదలకు సైతం ప్రాథమిక విద్య అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, బాగ్ అంబర్ పేట మాజీ కార్పొరేటర్ డిపి పద్మావతి రెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, టి వేణుగోపాల్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ బాలరాజు గౌడ్, జర్నలిస్టు సంఘాల నేతలు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా పాఠశాల యజమాన్యం రాహుల్, భవాని దంపతులు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు.

# కరీంనగర్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ నూతన కాంస్య విగ్రహావిష్కరణ







**కరీంనగర్ టౌన్ జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని రాజీవ్ చౌక్‌లో మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ నూతన కాంస్య విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ & రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికి సాంకేతిక విప్లవానికి పునాది వేసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. శ్రీలంకలో శాంతి స్థాపనకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం కాంగ్రెస్ కుటుంబమని పేర్కొంటూ, రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 1994లో ఎన్నో పోరాటాల మధ్య రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం సహా అనేక సంస్కరణలను రాజీవ్ గాంధీ తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ కలలుగన్న డిజిటల్ ఇండియాను నేడు సాకారం చేస్తున్నామని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టెలికాం రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ పునాది వేశారని తెలిపారు. ఆయన త్యాగస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీదేనని, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ చౌక్ సుందరీకరణలో భాగంగా నూతన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి సుడా తరఫున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

# ప్లాస్టిక్ కవర్లు మానండి పర్యావరణాన్ని కాపాడండి

- పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రసంగించిన గ్రామ సర్పంచ్




**తొర్రూరు ప్రతినిధి, జూన్ 5(పీసీడబ్ల్యు న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వి కవిత బాలకృష్ణ పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు ప్రసంగిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం మన గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుందాం ప్రతి ఒక్కరు పేపర్ కవర్లతో చేసిన సంచులను వాడాలని సూచించారు. పర్యావరణం దెబ్బ తింటే మానవాళికి ఎంతో నష్టం కలుగుతుందని కేవలం మానవులకే కాకుండా మూగజీవాల కూడా ప్రశాంతత కోల్పోతాయని సూచించారు. అలాగే వ్యవసాయ లో వరి కోసిన అనంతరం మిగిలిన గడ్డి మొక్కలను రైతులు తగలబెట్టడం వల్ల భూమిలో ఉన్న సారాన్ని కోల్పోయి మంచి చేసే క్రిములు కూడా చనిపోతున్నాయని వాటి వల్ల పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా వచ్చిన కార్యదర్శి సుధాకర్ కూడా అందరికీ పరిచయమైతూ వారు కూడా పర్యావరణాన్ని గురించి కొన్ని చక్కటి విషయాలను గ్రామస్తులకు విన్నవించారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని కొందరు మహిళలు రైతులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి





## ప్రకృతిని కాపాడదాం రేపటి తరానికి జీవాన్ని అందిద్దాం: గ్రామ సర్పంచ్ బోడ మౌనిక



**తల్లాడ, జూన్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూన్ 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తల్లాడ మండలం గూడూరు గ్రామ పంచాయతీలో మండల ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బోడా మౌనిక ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మనందరం భాగస్వాముల మవ్వాలని, అందుకు విధిగా ప్రతి ఇంటిలో ఒక మొక్కను నాటాలని, గ్రామాలలో అక్కడక్కడ నర్సరీలు ఏర్పాటు చేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని తద్వారా ఎకలాజికల్ బ్యాలెన్స్ గాడిలో ఉంటుందని, ఎప్పుడైతే ఎకలాజికల్ బ్యాలెన్స్ తప్పుతుందో మానవాళి మనగడకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఈ సందర్భంగా ఆమె సూచించారు. డీఎఫ్ఓ, ఎఫ్ఆర్వో, బీట్ ఆఫీసర్ లు, వార్డు సభ్యులు లక్ష్మీదేవి, బోడా నాగేశ్వరరావు, భూక్య బాలకృష్ణ, ఎక్కిరాల సుందర్ రావు, నారపోగు మరియన్న, విఎస్ఎస్ సభ్యులు, చిన్నారులు, రైతులు పాల్గొన్నారు.

# నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఉత్తరాఖండ్ రాష్ట్ర పర్యటన విజయవంతం....

## ఋషి కేష్ వేదికగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశంలో కరీంనగర్ ప్రగతి, విజన్‌పై గళం వినిపించిన ప్రధమ పౌరుడు కోలగాని శ్రీనివాస్

## సమావేశంలో వివిధ అంశాలపై తీర్మానాలు...కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు వినతి...











**కరీంనగర్ జిల్లా జూన్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషి కేష్ వేదికగా జూన్ 3, 4 తేదీల్లో రెండు రోజులపాటు జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశాలు గురువారం సాయంత్రం ముగింపు సమావేశం తో విజయవంతంగా పూర్తయ్యాయి . అఖిల భారతీయ మేయర్ల పరిషత్ జాతీయ అధ్యక్షురాలు రేణు బాలా గుప్తా(మేయర్, కర్నాల్) అధ్యక్షతన ఋషికేష్ లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశానికి హాజరైన నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ కరీంనగర్ పట్టణ ప్రగతి, విజన్ పై గళం వినిపించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశాలు విజయవంతం గా పూర్తయిన నేపథ్యంలో ఆసమావేశ వివరాలు తెలియజేస్తూ మేయర్ కోలగని శ్రీనివాస్ శుక్రవారం రోజున మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగాసమావేశంలో స్థానిక సంస్థలను మరింత ప్రభావవంతంగా, ఉత్తమంగా , శక్తివంతంగా చేయడానికి వివిధ అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. అఖిల భారతీయ మేయర్ల పరిషత్ దేశంలోని అన్ని నగరాల మేయర్లతో కూడిన ఒక జాతీయ సంస్థగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఆ దిశలోనే ప్రధానంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తరహాలో ఇండియన్ మునిసిపల్ సర్వీస్ (ఐ ఎం ఎస్) కేడర్‌ను ఏర్పాటు చేయాలనీ, ప్రస్తుతం రాష్ట్రాల వారీగా ఉన్న విధానానికి బదులుగా దేశవ్యాప్తంగా ఏకరీతి విధానం అమలు చేయడం ద్వారా స్థానిక సంస్థల అభివృద్ధి పనులు వేగంగాసాగుతాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పట్టణాభివృద్ధి మంత్రులు మరియు మేయర్ల సమావేశాన్ని నిర్వహించి, 74వ రాజ్యాంగ సవరణ అమలుకు అవసరమైన మార్పులపై ఏకాభిప్రాయం సాధించాలనీ. కేంద్ర పథకాల ప్రయోజనాల కోసం ఈ సవరణల అమలును తప్పనిసరి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థల కోసం రూపొందించే అభివృద్ధి పథకాల రూపకల్పన, అమలులో అఖిల భారతీయ మేయర్ల పరిషత్ ద్వారా మేయర్లకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మేయర్ పదవీకాలం 1 సంవత్సరం, మరికొన్ని రాష్ట్రాల్లో 2.5 సంవత్సరాలు మాత్రమే ఉందని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మేయర్ పదవీకాలాన్ని 5 సంవత్సరాలకు పెంచాలనీ కోరారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నమూనా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ,74వ రాజ్యాంగ సవరణను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఈ మేరకు తగిన ఆదేశాలు జారీ చేయాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్వహించే వివిధ శిక్షణ కార్యక్రమాలను అఖిల భారతీయ మేయర్ల పరిషత్ ద్వారా నిర్వహించాలన్నారు. సమావేశంలో ప్రస్తావించిన అంశాలను, డిమాండ్లను పరిశీలించాలని , అలాగే అన్ని విషయాలపై విస్తృతంగా చర్చించేందుకు ఒక ప్రతినిధి బృందానికి సమావేశ సమయం కేటాయించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి మనోహర్ లాల్ కట్టర్ కు సమావేశం ద్వారా విజ్ఞప్తి చేసి , సమావేశ తీర్మాన లేఖను మంత్రికి పంపించడం జరిగిందని కోలగని శ్రీనివాస్ తెలిపారు. తన ఋషి కేష్ పర్యటన విజయవంతంగా కొనసాగిందని , ప్రప్రదమంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశాల్లో పాల్గొనే అవకాశం దక్కడం , కరీంనగర్ నగర అభివృద్ధిపై , విజన్ గురించి, స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ గురించి మాట్లాడే అవకాశం రావడం పట్ల కోలగాని శ్రీనివాస్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కరీంనగర్ నగరపాలక సంస్థను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేసి, ప్రశంసించడం, రాష్ట్రమంత్రి మదన్ కౌశిక్ జి తనను సన్మానించి , జ్ఞాపకను బహూకరించడం , ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులను , దేశంలోని ఆయా మేయర్లను ఈ సమావేశం ద్వారా కలుసుకోవడం మర్చిపోలేని అనుభూతిని అందించాయని కొలగాని శ్రీనివాస్ అన్నారు.

---

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

## • 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730




**న్యూఢిల్లీ,జూన్ 05:** భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కొత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

---

# వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



## • శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ

**తిరుపతి,జూన్5:** తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---

# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు




## ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ

## రెపోరేటును యధాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం

## ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

**ముంబై,జూన్5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.